# మధ్యమావతి

అనగనగా ఒక దేశం. దాని పేరు కుంతల. ఆ దేశాన్ని ఖారవేలుడనే రాజు పరిపాలిస్తున్నాడు. అతనికొక భార్యా, ఒక కూతురూ వున్నారు. ఖారవేలుడు చాలా మంచివాడు. చాలామంది రాజులవలెనే అతనుగూడా ప్రజలను కన్న బిడ్డలకుమల్లే చూశాడు. పంటలు పండనప్పుడు చాలా కొద్దిపన్నులు వసూలుచేసేవాడు. అధికంగా పండినప్పుడుమాత్రం ఎక్కువ పుచ్చుకొనేవాడు కాదు. వైద్య సదుపాయాలు చేశాడు. విద్యావకాశాలు కల్పించాడు. కవులను పండితులను పోషించాడు. అతని ఏలుబడిలో ప్రజలు మూడు పువ్వులు ఆరు కాయలుగా బ్రతికారు.

కానీ—

అతని పరిపాలన దినదినగండం నూరేళ్ళాయుస్సుగా వుండవలసి వచ్చింది. అతని సరిహద్దు రాజ్యాలు అతన్ని నామరూపాలు లేకుండా చేయాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ముఖ్యంగా మగధరాజు, తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. అతనికంటే ముందుగానే కుంతలదేశాన్ని ఆక్రమించుకోవాలని గాంధార ప్రభువు ఆరాటపడుతున్నాడు. కుంతల దేశాపహరణం విషయంలో పైరెండు దేశాలకూ సఖ్యత కుదరటంలేదు. పరస్పరం వంచించుకొంటున్నాయి. ఎవరు ముందుగా ఖారవేలునిపై యుద్ధం ప్రకటి

స్తారో ఎవ్వరూ చెప్పలేకుండా ఉన్నారు. కుంతలరాజ్యం ఎవరి స్వాధీనమైనా, ఆ మిగిలిన రెండవవారు నామరూపాలు లేకుండాపోవటం ఖాయం. ఎందుకంటే కుంతల సైన్యం యుద్ధానికి అంతగా అలవాటుపడి ఉండనప్పటికీ, ఆ దేశ సంపత్తి అపారం కనుక, యుద్ధానికి పుష్కలంగా సరిపోతుంది. కొంచెె మెంచుమించుగా మగధ, గాంధార ప్రభువులు ఇలా ఆలోచించుకుంటున్నారు. కుంతలాపహారణం విధిగా జరిగితీరవలసిందే! అంతవరకూ, మగధ గాంధార వల్లభులు ఏకీభవిస్తారు. కాని ఆక్రమణానంతరం దేశం ఎవరి ఆధీనంలో ఉండాలి? ఇద్దరి ఆక్రమణక్రిందా ఉండటం–ఇద్దరికీ నచ్చదు. అందువల్ల, గాంధారపతిగానీ, మగధచక్రవర్తిగానీ సాధించగలిగిందేమీ లేదు. ఇద్దరూ ఆయుధాలు తయారుచేస్తున్నారు. ఇద్దరూ సైనిక సన్నాహాలు పూర్తిచేస్తున్నారు. ఇద్దరూ శుభముహూర్తాలకై ఎదురుచూస్తున్నారు.

ఈ విషయమంతా వేగులద్వారా తెలిసికొన్న ఖారవేలునికి ఏమీ పాలుపోలేదు. కర్తవ్యతా విమూఢుడైనాడు. ఇద్దరూ తనను కబళింపజూస్తున్నారు. ఇద్దరూ తన నాశనాన్ని కోరుతున్నారు. అట్లా కాని పక్షంలో ఏమి చేయవలసిందీ ఖారవేలునికి తెలుసు. కానీ దురదృష్టవశాత్తూ అందుకు భిన్నంగా జరుగుతున్నది. తన సైన్యం అల్పమేమీ కాదు. ఆయుధ సంపత్తిగూడా అగ్గలంగానే ఉన్నది. అంతమాత్రాన మగధ, గాంధార సైన్యాలతో పోరాడుతుందనుకోవటం అవివేకం. పోరాడి నావిజయలక్ష్మిని చేపట్టుతుం

దనుకోవటం కేవలం అజ్ఞానం. ఉన్న ఈపరిస్థితినంతా పేరోలగంలో చెబుదామనుకొన్నాడు ఖారవేలుడు. చెప్పి సలహాలడుగుదా మనుకున్నాడు. మహా మంత్రులకు, దండ నాథులకు, సైన్యాధికారులకు స్ఫురించని హంశాలు సామాన్య జనానికి స్ఫురిస్తాయని ఖారవేలుడు ఎప్పుడూ ఆశించలేదు. కానీ, అలా తెలియజేయటం తనవిధి. ప్రయోజనా ప్రయోజనాలతో తనకు నిమిత్తంలేదు. విధి యుక్తంగా నడుచుకోవటమే తనకు కావాలి.

అనుకొన్న విధంగానే-ఒకానొక శుభముహూర్తాన సభ నేర్పాటుచేయించాడు ఖారవేలుడు. సభ్యులు ఇబ్బడి ముబ్బడిగా వచ్చారు. ఒకవైపు ఉన్నత రాజోద్యోగులు పరివేష్టించి ఉన్నారు. మరొకవేపు రాజ బంధువులు, ఆంత రంగిక సచివులు, సైన్యాధిపతులు ఆసనా లలంకరించారు. ఖారవేలుని ముఖాన కత్తివ్రేటుకు నెత్తురులేదు. మంత్రి ముఖ్యాదులు ఆలోచనా నిమగ్నులై ఉన్నారు. సదస్యులు ఉద్విగ్నచిత్తులై, జిజ్ఞాసితవ్యులై రాజుగారివైపు చూస్తు న్నారు.

ఇంతలో ప్రతీహారి ఒకడు పరుగుపరుగున వచ్చి, రాజుమ్రోల నొక కమ్మ నుంచాడు. అందరి దృక్కులూ అటు ప్రసరించాయి. రాజు దాన్ని అందుకొని చూచాడు. కనుబొమ్మలు ముడివడ్డాయి. మంత్రిగారి కిచ్చాడు. మంత్రి గారు చూచారు. ఒక్క క్షణంపాటు ఆలోచించాడు. ప్రతీహారి కేదో సంజ్ఞ చేశాడు.

నాలుగైదు నిముషాలకల్లా ఒక యోధుడు సంభాంగణంలో ప్రవేశించాడు. రాచమర్యాద ననుసరించి తద్జ్ఞులందరికీ నమస్కరించాడు. ప్రత్యభివాదా లందుకొన్నాడు.

'ప్రభూ! నా పేరు క్షేమేంద్రుడు' అన్నా డా ఆగంతకుడు. 'నా జన్మభూమి గాంధారం. నేను రాచవంశీకుణ్ని. మొన్న మొన్నటి వరకు నేను పదాతి దళాధిపతిగా ఉండేవాణ్ని. కురుదేశంతో సంభవించిన మహా సంగ్రామంలో నా బలాలు ఘోరాతి ఘోరంగా పోరాడాయి. కురు సేనాపతుల పద్మవ్యూహాలను నే నవలీలగా ఛేదించాను. భయంకరమైన అరణ్యాల్లో, కొండల్లో, దారుణమైన శీతోష్ణస్థితులలో నా సైన్యం నిలువబడి యుద్ధంచేసింది. విజయం మాకే లభించింది. కాని అపారమైన నష్టానికి నా దళం పాల్పడవలసి వచ్చింది. విజయం కైవశం చేసికొన్నానన్న తృప్తి నాకేకోశానా లేదు. అయినా గాంధారపతి నా చాకచక్యానికి సంతసించి సర్వసైన్యాధ్యక్షునికి, ముఖ్య సలహాదారుగా నియమించారు. సంతోషమే! కానీ, ఇంతవరకూ, నా ఆజ్ఞాబద్ధులై, ఘోరంగా యుద్ధంచేసి అసువులను కోల్పోయినవారికి, వికలాంగులైనవారికి ఏవిధమైన సహాయమూ గాంధారవల్లభుడు చేయలేదు. నేనీ విషయమై వారితో సంప్రదించాను. వా రంగీకరించలేదు. అందుకు ఎన్నెన్నో కారణాలు చూపెట్టారు. సైన్యం కేవలం బలమైన యంత్రంలాంటిదట. సైన్యచోదకుడు మేధావి గాకపోతే, ఆ బలమంతా నిరుపయోగమేనట. కేవలం సైన్యం చేయుగలిగేదేమీ లేదు గనుక, వారికి పారితోషికాదు

లివ్వటం అసంభవ మన్నారు. వారి సహాయంలేనిదే ఏపనీ జరుగదన్నాను. యంత్రచోదకు డెంత నిపుణుడైనా, యంత్రం బలహీనమయినదైతే అతగాడి నిపుణత్వం గవ్వకు కొరగా దన్నాను. వారొప్పుకోలేదు. మాటామాటా పెరిగింది. దానికితోడు-నా ఉన్నతాధికారాన్ని చూసి, అసూయచెందిన వారు-రాజుగారి చెవులు కొరికారు. ప్రభువు నన్ను దేశ బహిష్కృతుణ్ణి చేశారు. మీరు ధర్మప్రభువులని, కారుణ్య హృదయులని విని వచ్చాను. మీ ఆస్థానంలో నాకు సముచితస్థానం లభించగలదనే నమ్మకమే నన్నిక్కడకు చేర్చింది. ఆ పైన తమ ఇష్టం' అని ఆసనాసీనుడైనాడు క్షేమేంద్రుడు.

రాజుగారు మంత్రిని చూశారు. మంత్రి సైన్యాధిపతిని చూశాడు. సైన్యాధిపతి నేలవంక చూశాడు. ఆ పూటకు సభ ముగిసిందని ప్రకటన జరిగింది. రాజు, మంత్రి, సైన్యాధిపతి, ఏకాంత మందిరంలోకి వెళ్ళారు. క్షేమేంద్రుడు తనకై నియోగింపబడ్డ భటుని వెంట విడిదికి వెళ్ళాడు.

క్షేమేంద్రుని రాకతో ఖారవేలుని రాజకీయ తంత్రం మరొక క్రొత్తదశ నందుకొన్నది.

ఇతగాడు చెప్పినదంతా సత్యమే అయితే-బహుశః కాకపోవచ్చు -గాంధారపతిని ఎదుర్కోవటం సులభమే! గాంధార సైన్యపు గుట్టుమట్టులన్నీ క్షేమేంద్రునికి క్షుణ్ణంగా తెలుసు. నిన్న మొన్నటివరకూ, ఇతనా సైన్యంలో ఉండ

టమే అందుకొక కారణం. అంతకన్నా ముఖ్యం - పదాతిదళంలో ఇతనికున్న పేరు ప్రతిష్ఠలు అనన్యమైనవి. తమకోసం రాజుతో పోరాడి, తమ కేవేవో ఉపకారాలు చేదామని తీవ్రంగా ప్రయత్నించి, రాజతిరస్కృతుడై దేశబహిష్కృతుడుగూడా అయిన క్షేమేంద్రుడంటే — ఈ క్షణానికీ-పదాతిదళం నమస్సులర్పించి తీరుతుంది. ఇందులో సందేహించవలసిందేమీ లేదు. అదీగాక గాంధారాధిపునకు ఉన్నదల్లా పదాతిదళమే! అలాగని ఇతర సైనిక శాఖలు లేకపోలేదు. గాంధార సేనాసమూహంలో పదింట ఎనిమిది పాళ్ళు పదాతిసైన్యం. ఆ సైన్యం క్షేమేంద్రునికి భక్తిప్రపత్తు లర్పిస్తున్నది. క్షేమేంద్రుడు తమను-దాదాపు-శరణుజొచ్చాడు. క్షేమేంద్రుడు తమ సేనావాహినికి ఆధిపత్యం వహించి, గాంధార బలంతో పోరుతున్నప్పుడు, గాంధార పదాతివీరులు క్షేమేంద్రునిపైకి అమ్ము విసరగలరా? కాకపోగా అతనికి లొంగిపోగల అవకాశాలుగూడా వున్నాయి. అదే సంభవించిన పక్షాన, గాంధారం కుంతలదేశంలో విలీనమవడమే కాకుండా, మగధ సామంతరాజ్యంగా జోహారు లివ్వాలి. ఆత్మరక్షణోపాయం తెలీక కొట్టుమిట్టాడుతున్న ఖారవేలుడు, క్షేమేంద్రుని రాకతో సామ్రాజ్య విస్తీర్ణతను గుణిస్తున్నాడు.

రోజులు గడిచిపోతున్నాయి. మగధ గాంధార బలాలు కుంతలదేశంమీద దాడిచేయలేదు. చేయలేదు సరికదా సైనికసన్నాహాలుచేస్తున్న వార్తలనుగూడా వేగులు తీసికొనిరావటంలేదు. ఆ రెండు దేశాలు ఆ ప్రయత్నా

లలోనే లేవని తెలియవచ్చింది, కారణాలుమట్టుకు బయట పడలేదు. కుంతల సైన్యం పునర్నిర్మించబడుతున్నది. క్రొత్త ఆయుధాలను క్షేమేంద్రుడు ప్రవేశపెట్టాడు. వినూత్న మార్గాలలో సైనికశిక్షణ ఇవ్వబడుతున్నది.

అయినా — ఖారవేలుడుగానీ, ముఖ్యమంత్రిగానీ క్షేమేంద్రుని పూర్తిగా విశ్వసించలేదు. ఏమో?— క్షేమేంద్రుడు గాంధారవాసి. మీదుమిక్కిలి రాజవంశీయుడు. ఏదో మాటపట్టింపువల్ల దేశబహిష్కృతుడు కావచ్చు. అంతమాత్రాన విశ్వసనీయు డెలా అవుతాడు? శత్రుదేశ బహిష్కృతులందరూ విశ్వసనీయులు కారే! కాక— గాంధారపతే పంపివుండగూడదా? అతని కుంతలదేశాక్రమణలో, ఇదిగూడా ఒక భాగమయి వుండగూడదా ? 'ఔ' నని గానీ, 'కా'దని గానీ అనేందుకు ఆధారాలు సమానంగానే వున్నాయి. ఇంతవరకూ, ఈ గాంధారేయుని ప్రవర్తనలో అనుమానాస్పదమైన అంశాలేమీ లేవు. నిజమే ! అంతమాత్రాన జరిగేదేమిటి?

ఎందుకైనా మంచిదని ముఖ్యమంత్రి, క్షేమేంద్రుణ్ణి ఒకకంట కనిపెడుతున్నాడు. రోజులు, వారాలు, నెలలు గడిచిపోతున్నాయి. యుద్ధభయం అంతరించింది. ఈ క్షణాన ఏ దేశం కుంతలమీద దండెత్తినా, అది జంకదు. నవీన పద్ధతులలో సుశిక్షితమైన ఆరు లక్షల సైన్యం దానికున్నది. అశ్వికులు లక్షవరకూ ఉన్నారు. గజబలం సమృద్ధిగా ఉన్నది. ఖారవేలుడు ఏ నిమిషాన అనుజ్ఞనిస్తే, ఆనిమిషాన, అటు గాంధారాన్నిగానీ, ఇటు మగధనుగానీ, లేక రెండిం

టినిగానీ, కుంతల వీరులు ఎదుర్కొనగలరు, విజయాన్ని పొందనూగలరు. అయినా ఖారవేలుడు అలాంటి ఆజ్ఞనివ్వ లేదు. బహుశః కొద్దిరోజుల్లో ఇవ్వగలడేమో మరి!

అన్ని సంవత్సరాలవలెనే, ఆ ఏడుగూడా వసంతోత్సవం జరిపితీరాలని ఖారవేలుడు సూచించాడు. మంత్రిగారు ఆమోదించారు. దానికి తగిన సంబారములన్నీ సమకూర్చమని క్రింది ఉద్యోగులకు ఆజ్ఞాపించ్చారు.

వైశాఖ పూర్ణిమ సమీపిస్తున్నది. నగరమంతా అలంకరింపబడుతున్నది. దేశమంతటా గాలించి, అపురూపమైన, చిత్రవిచిత్ర వస్తువులను రాజోద్యోగులు కోటకు జేరవేస్తున్నారు. కవులు, పండితులు, చిత్రకారులు, నాట్యకళానిష్ణాతులు, గాయకులు, బహుమతు లందుకొనేందుకు రాజధానికి వస్తున్నారు. ఆ వచ్చినవారికి సముచిత మర్యాదలు చేయడంతో రాజోద్యోగులకు ఊపిరిసలపటంలేదు. ఆస్థాన నటీనటులు, మాళవికాగ్ని మిత్రాన్ని ప్రదర్శించటానికి సమాయత్త మవుతున్నారు. మరొక జట్టు మృచ్ఛకటికాన్ని ప్రదర్శించే ఏర్పాట్లు చేసుకొంటున్నారు.

వసంతోత్సవంలో ఏయే కార్యక్రమం ఎప్పుడెప్పుడు జరగవలసిందీ మంత్రి నిర్ణయించాడు. పున్నమినాటి నుండే ఉత్సవోధృతం మిన్నుముట్టుతుంది. ఆనాటి ఉదయం నుండి మధ్యాహ్నం వరకు, సైనికవిన్యాసముంటుందని, అందరూ సర్వాయుధధారులై ఉండాలనిగూడా అన్నారు. ఎన్నడూ లేని ఈ సైనికవిన్యాసం ఎందు కేర్పాటుచేయబండిదో

సామాన్యులు ఊహించలేకపోయారు. క్షేమేంద్రుడు వెళ్ళిన తరువాత ముఖ్యమంత్రి ఇలా అన్నాడు:

"ప్రభూ! క్షేమేంద్రుడు అవిశ్వసనీయుడని నే నననను. కానీ అతను గాంధార రాజవంశీయుడు. అతనినుండి మనం పొందవలసింది ఉపకారమేగానీ, అపకారం కాదుగదా! సైన్యం చెదరిపోకుండా ఉండటం కోసరం, అప్రమత్తులై ఉండటం కోసరం, నే నీ ఏర్పాటు గావించాను. ఉత్సవోన్మత్తులమై మనమున్నప్పుడు—క్రీడించుతున్నందుకు క్షమించచండి—శత్రుసైనికులు కోటను తాకకుండా ఉండేందుకు—కనీసం దాని రక్షణకై నేనీ పనిచేశాను. వేగులు అలాంటి వార్తలు తీసికొని రాలేదనుకోండి. ఆ భయం కేవలం భ్రమే ననుకోండి. కానీ ఇలా చేసినందువలన నష్టమేమీ లేదు గనుక చేశాను" అని సంజాయిషీ చెప్పుకొన్నాడు.

కుంతల దేశంలో ఒక విచిత్రమైన ఆచారం ఉన్నది. ఆనందదాయకమైన వసంతోత్సవంనాటి రాత్రి ఒక నరుణ్ణి బలిగా ఇవ్వాలి. ఈ ఆచారం ఎప్పుడేర్పడిందో, ఎందు కేర్పడిందో ఎవ్వరికీ తెలియదు. కానీ ఆ వంశీయులిప్పటికీ దాని నాచరిస్తూనేఉన్నారు. రాజశాసనోల్లంఘనం చేసినవారినిగానీ, రాజవంశంపట్ల అమర్యాదగా ప్రవర్తించినవారినిగానీ, ఆనాడు బలివేస్తారు. బలివేయబడేవారు తుదిక్షణంవరకూ ఎవ్వరికీ తెలియదు. ఆ విషయం రాజు, మంత్రులవద్ద రహస్యంగా ఉంటుంది. ఒక్కొక్కసారి అంతఃపుర దాస దాసీజనం ఇందుకు గురికావలసి ఉంటుంది. ఏదో ఒక నెపంవేసి, ఆనాడు ఒక మానవ

ప్రాణిని బలిచేయక తప్పదు. ఈ హేయమైన ఆచారం ఈ సంవత్సరం ఎవ్వరితో ముగిసిపోతుందోనని అందరూ హడలిపోతున్నారు. దాసదాసీలు ప్రాణా లరచేతిలో పెట్టుకొని గడగడలాడిపోతున్నారు. ప్రేక్షక జనం... సరే—

ప్రొద్దు వాలింది. ఉత్సవాలు అవిఘ్నంగా సాగిపోతున్నాయి. భేరీ పటాహ కాహళాదుల ధ్వని మిన్నంటుతున్నది.

అంతఃపురాన్నానుకొని ఒక ఉద్యానవన మున్నది. ఆ ఉద్యానవనంలో ఈనాడు క్షేమేంద్రుడు తన ఆయుధ ప్రదర్శనలిస్తున్నాడు. అంతఃపురాంగనలకోసం ముఖ్యమంత్రే ఈఏర్పాటుచేశాడు. చిత్రవిచిత్ర గతుల్లో క్షేమేంద్రుడు తన పాటవాన్ని ప్రదర్శిస్తున్నప్పుడు, కుంతలాంగనలు మధ్యమధ్య కరతాళధ్వనులు చేస్తున్నారు. అపాయకరమైన ఆయుధాలను అవలీలగా ఉపయోగిస్తున్నప్పుడు ఆశ్చర్యపోతున్నారు. వారిస్తున్నారు. సంతోషాన్ని ప్రకటిస్తున్నారు.

కాలాన్ని సూచిస్తూ యామికుడు ఘంటికను మ్రోయించాడు. ప్రదర్శనం సమాప్తిచెందింది. తెరమరుగునుండి ఒక చేటిక క్షేమేంద్రునివద్ద కొచ్చి యిలా అన్నది:

"మీ చాతుర్యాన్ని రాజకుమారి ఎంతో అభినందించారు. మీఆయుధప్రదర్శన, అప్పుడు ప్రదర్శించిన మీ విశేష నైపుణ్యము, చిన్నమ్మవారిని ఆశ్చర్య చకితులను చేశాయి. వచ్చి బహుమానం పుచ్చుకోండి"

దాసి వెళ్ళి పోయింది.

క్షేమేంద్రుడు ఆనందంతో తన్మయుడైనాడు. శరీరంనుండి కారుతున్న చెమటను తుడుచుకొంటూ ముందుకెళ్ళాడు. విశాలమైన హాలులో, అందమైన సుఖాసనం. రాజకుమారి వయ్యారంగా కూచునిఉంది. క్షేమేంద్రుడు చుట్టూ చూశాడు. ఎవ్వరూలేరు. తను పొరపడ్డానేమో ననుకొన్నాడు. వెనుతిరగబోయాడు. కానీ తిరగలేదు. రాజకుమారి చిన్న చప్పుడు చేసింది. క్షేమేంద్రుడు కన్నులెత్తి చుశాడు. సువర్ణచ్ఛాయ లీనుతున్న దేహం, గుండ్రని ముఖం. వివిధాభరణాల కాంతులతో మిల మిలా మెరిసిపోతున్నది. నవయవ్వనం, ఆమె సోయగానికి మెరుగు బెడుతున్నది. రాజకుమారి పెదవులపై దరహాసం వెల్లివిరుస్తున్నది అజాగ్రత్తగా వదిలివేయబడిన వలువ.... క్షేమేంద్రుడు చేతులు కట్టుకొని నిలబడ్డాడు. రాజకుమారి వయ్యారంగా లేచింది, ఆకసంలో హరివిల్లు విరిసినట్లు, జగత్సౌందర్యమంతా మూర్తీభవించినట్లు; క్షేమేంద్రుడు రెండడుగులు వెనక్కు వేశాడు.

ఒకటి, రెండు, మూడు, నాలుగు....పది... ఇరవై నిమిషాలు గడిచిపోతున్నాయి. రాజకుమారి ముఖంమీద క్రమంగా దరహాసం అంతరించింది. పెదవులదరుతున్నాయి. కన్నులెర్రపడ్డాయి. చెక్కిళుల కెంజాయ లలముకొన్నాయి. సౌందర్యానికి కాణాచియైన ఆ వదనం, కోపాగ్నిని వెదజల్లుతున్నది. క్షేమేంద్రుడు క్రుంగిపోయాడు. అతని కేమీ

స్ఫురించలేదు. పిచ్చివాడయిపోయాడు. అతి ప్రయత్నంతో ఎలానో నిగ్రహించుకొన్నాడు.

"తప్పుచేస్తే క్షమించండి. చేటిక బహుమాన స్వీకృతార్థం రమ్మన్నది. వచ్చాను. రాకూడదని తెలియదు" అన్నాడు వినయంగా.

రాజకుమారి కోపం మీరిపోయింది. విసావిసా నడిచి లోపలికెళ్ళింది. క్షేమేంద్రుడు దిగాలుపడిపోయాడు. అంతా ఇంద్రజాలంగా జరిగిపోయింది. తనేమి చేశాడు? భర్తృదారిక ఎందు నిమిత్తం కోపగించుకొన్నది? ఈ ప్రశ్నలకు సరయిన సమాధానం కోసం అతను మథనపడుతున్నాడు. ఏ నిర్ణయానికీ అత నింకా రాలేదు. ఖారవేలుని ఆజ్ఞాప్రతాన్ని చూపెట్టి, నలుగురు యమభటులవంటి సైనికులు అతన్ని సంకెలలతో బంధించారు. క్షేమేంద్రుడు నిరుత్తరుడయ్యాడు. నిశ్చేష్టుడయ్యాడు.

బలివేయవలసిన వాడు దొరికాడనే వార్త నగరమంతటా గప్పున వ్యాపించింది. కానీ అతడెవరో? తమరు కానందుకు అమితంగా సంతోషించారు. ఆ దురదృష్టవంతుని కోసం విచారించారు.

బలి యివ్వవలసిన సమయమొచ్చింది. రాజభటులు ముసుగుకప్పిన ఒక వ్యక్తిని తీసుకొచ్చారు ఈ సంవత్సరపు దురదృష్టవంతుణ్ని చూడటం కోసరం జనం తండోపతండాలుగా వచ్చారు. రాజభటులకు వారిని సర్దటం అశక్యమవుతోంది. బలిఇవ్వబొయ్యే ముందు, నేరస్థుని నేరమేమిటో చెప్పటం రివాజు. ఆ ఆచార ప్రకారం మంత్రి

గారు క్షేమేంద్రుడు చేసిన నేరమేమిటో ఇలా చెప్పారు:

"రాజకుమారి, ఇతని ఆయుధపాటవాన్ని చూశారు. ఎంతగానో సంతోషించారు. వివిధాయుధాలతో ఇతను చూపెట్టిన ప్రదర్శన వారి కమితంగా నచ్చింది. స్వయంగా బహూకరించవలె ననుకొన్నారు. కబురుచేసి, రప్పించు కొన్నారు. కానీ, ఇతగాడు భర్తృదారికను అవమానించాడు. ఇతని జడత్వానికి ఈ శిక్ష విధించాలని రాజుగారు ఆజ్ఞాపించారు."

కానీ ప్రజల్లో నమ్మకం కుదరలేదు. క్షేమేంద్రుడు చేసిన నేరమేమిటో బైటపెట్టమని కొందరడిగారు. మంత్రి గారికి బైటపెట్టక తప్పలేదు.

"రాజకుమారి సౌందర్యం వర్ణనాతీతం. అప్సరాంగనల అందమంతా చిరంజీవిని పుణికి పుచ్చుకొన్నది. మగధ, గాంధార, మహీపతులు కుంతల దేశాపహరణం చేయాలనుకోవటం రాజకుమారి సౌందర్యాన్నపేక్షించేనని మీకు తెలుసు. ఆ జగదేకసుందరి ఈనాడు ప్రత్యేకాలంకరణం కూడా చేసికొన్నది. కాశ్మీర కేశాలంకరణ, మధ్యప్రాంత వస్త్రాలంకరణ చిరంజీవిని సౌందర్యాన్ని రెట్టింపుచేస్తున్నాయి. క్షేమేంద్రుడు బహుమానం కొరకు లోపలి కొచ్చాడు. దాసీలెవ్వరూ లేరు. ఒంటరిగా రాజకుమారి కూచున్నారు. అటువంటి సౌందర్యరాశి ఎదురుగా ఉంటే, చేయవలసిం దేమిటి? ఆ సౌందర్యనిధిని ఎలా గౌరవించాలి? ఆ అందాన్ని ఎట్లా పూజించాలి? పురుషుడన్నవాడు ప్రవర్తించవలసినవిధంగా ఇతగాడు అక్కడ మెలగలేదు. వివ

యంతో, భయంతో కుంచించుకుపోయాడు. చిరంజీవిని ఇతన్ని సమీపించింది. దురదృష్టవంతుడు— వెనకడుగు వేశాడు. అది రాజకుమారి సౌందర్యాన్ని తృణీకరించటమే కాగలదు. ఈ అవమానం రాజవంశం భరించదు. ఖారవేల ప్రభువుగారి తనయ—తన అందంతో—ఒక పురుషుణ్ణి ఆకర్షించలేకపోయిందన్న అవమానం దుస్సహమైనది. ఈ అపచారానికి గాను ఇతన్ని…"

ఆతరువాత మాటలు జనంరొదలో కలిసిపోయాయి. కత్తివేటు—చిన్న మూలుగు…రక్తం సర్రున చిమ్మింది. ఖారవేల ప్రభువు ఆచార ప్రకారం కుంభహారతి నిచ్చారు. ప్రజలు జయజయధ్వానాలు చేశారు.